


**లూకా 8:5-8, క్రీస్తు ప్రభువు ఈ లోకములో ఉన్నప్పుడు అనేక ఉపమానములు చెప్పెను. ఉపమానమనగా పరలోక సంగతులను భూలోక సంగతులను పోల్చి చెప్పుట. ఉపమానము లేకుండా ఆయన బోధింపలేదు (మత్తయి 13:35). ఆయన చెప్పిన ఉపమానములు మన ఆత్మలకు ఎంతో బలమును, ఆశీర్వాదమును ఇచ్చెడివిగా ఉన్నవి. అట్టి వాటిలో విత్తువాని ఉపమానము ఒకటి. దానిలో ఆయన నాలుగు రకముల నేలలను గూర్చి వివరించెను. అవి మన హృదయమునకు సాదృశ్యముగా ఉన్నవి. విత్తువాడు అనగా దేవుని సేవకుడు. విత్తనము దేవుని వాక్యమునకు గుర్తుగా యున్నది.**

## త్రోవ ప్రక్క నేల

ఈ ఉపమానమును మత్తయి, మార్కు లూకా గార్లు వ్రాశారు. మత్త 13:3-9, మార్కు 4:4-9, లూకా 8:5-8. ఈ మూడు సువార్తలలో ఈ ఉపమానము చదువగలము. త్రోవ ప్రక్క నేలలో పడిన విత్తనమును ఆకాశపక్షులు వచ్చి ఎత్తికొని పోయెను. త్రోవ ప్రక్కనేల గట్టిగా యుండును. విత్తనము పడినప్పటికి నేల గట్టిగా యుండుట వలన విత్తనము నాట బడదు. అది పైపైన మాత్రమే యుండును. ఈ దినములలో అనేకుల భక్తి జీవితము పైపైన అనగా పెదవుల ఆరాధన గానే యున్నది. వారు పెదవులతో ఆరాధించుచున్నారు, గాని వారి హృదయము దేవునికి దూరముగా యున్నది. మత్త 15:9. హృదయములో ప్రభువు లేరు. పాపము హృదయములో చోటు చేసుకొనుచున్నది. సమరయ స్త్రీ ప్రభువుతో మాట్లాడుచున్నప్పటికి ఆమె హృదయములో పాపము దాచుకొన్నది. యాకోబును తండ్రి అని పిలచుచున్నది గాని (యోహా 4:12), మార్పు చెందిన యాకోబు లక్షణములు ఆమెలో కనబడుట లేదు. పాపమును దాచుకొని ప్రార్థన చేసినచో ప్రభువు వినడు (కీర్త 66:18). నోటికి దగ్గరగా ఉన్న దేవుడు హృదయమునకు దూరముగా ఉన్నాడు (యిర్మి 12:2), ప్రియుడా నీ హృదయములో ప్రభువు ఉన్నాడా? త్రోవ ప్రక్కనేల గట్టిగా యున్నది అనగా హృదయకాఠిన్యత సూచించుచున్నది. మార్పు పొందని హృదయములో కాఠిన్యము ఉన్నది (రోమా 2:5), అట్టివారి మీదికి దేవుని ఉగ్రత వచ్చును. భయంకరమైన తీర్పులో

వారు నిలుచుచుందురు. ఫరో తన హృదయమును కఠిన పర్చుకున్నాడు (నిర్గ 8:15), ఎన్నిసార్లు ప్రభువు అవకాశమిచ్చినను అతడు దేవుని మాటను వినలేదు. అందువలన ఎఱ్ఱసముద్రములో మునిగిపోయెను. ప్రభువు అన్యాయస్థుడుకాదు. ఎన్నోసార్లు నీకు తరుణములు ఇచ్చుచున్నాడు. నీవు నిర్లక్ష్యము చేయుచున్నావా? *సాధు సుందర్ సింగ్ ఒక పర్యాయము టిబెట్ వెళ్ళుచుండగా అరణ్యములో ఒక సెలయేరు యొద్దకు వచ్చెను. దానిలో ఒక గుండ్రపు రాయిని చూచెను. ఆయన దానిని పగుల గొట్టినపుడు ఒక చుక్క నీళ్ళు కూడా దానిలోనికి వెళ్ళలేదు. దాని పైగా ఆ సెలయేరు ఎన్నో సంవత్సరములు ప్రవహించుచున్నది.* నీవు ఎంతో కాలమునుండి దేవుని వాక్యము వినుచున్నప్పటికి ఆ వాక్యము నీ హృదయపు లోతులలోనికి వెళ్ళినదా? వాక్యము హృదయములోనికి వెళ్ళినచో జీవమును ఆరోగ్యమును ఇచ్చును (సామె 4:22).

ఆకాశపక్షులు దురాత్మల సమూహామునకు సాదృశ్యముగా ఉన్నవి (ఎఫెసీ 6:12). అనగా సాతాను నీలో పడిన వాక్యమును ఎత్తికొని పోవును. కొంతమంది వాక్యము చెప్పుచున్నప్పుడు నిద్రపోవుదురు. సాతాను వారికి నిద్రకలిగించును. అందువలన వాక్యము వారికి గుర్తుండదు. మరియ తన హృదయములో వాక్యమును భద్రము చేసికొనెను. (లూకా 2:19). డబ్బు, విలువైన వస్త్రములు, వెండి బంగారముల కంటె వాక్యము విలువైనది. సాతాను మొదటిగా నీలో ఉన్న వాక్యమును ఎత్తికొనిపోవును. నీవు అపవాదికి చోటిచ్చినచో నిన్నుకూడా వాడువెళ్ళే నిత్యాగ్నిలోనికి ఎత్తికొని పోవును (మత్త 25:41). గనుక అపవాదికి చోటియ్యకుడి అని వాక్యము చెప్పుచున్నది (ఎఫెసీ 4:27).

## రాతి నేల

చాలా మన్నులేని రాతినేల అని మత్తయి గారు వ్రాశారు (మత్త 13:5). వాక్యము ఈ నేలలో ఫలించినది. అనగా వీరు వాక్యమును అంగీకరించి రక్షింపబడినవారు. ప్రభువును అంగీకరించినవారు ఆయన పిల్లలగుదురు. (యోహా.1:12). పిల్లలమైతే వారసులము (రోమా 8:17). తండ్రి ఆస్తిలో మనకు భాగమున్నది. ఆయన మనలను ధనవంతులనుగా చేయుటకు దరిద్రుడాయెను (2 కొరింథి 8:9). రెండవదిగా తండ్రి యింటిలో(పరలోకములో) మనకు స్థలమున్నది (యోహా 14:2)... మూడవదిగా తండ్రి యొక్క సంరక్షణ, కాపుదల మనకు ఉన్నది (కీర్త 121:4). ఇంత గొప్ప ఆధిక్యతలు రక్షింపబడినవారికున్నవి. జక్కయ్య రక్షించబడినపుడు అబ్రహాము కుమారుడుగా పిలువబడెను. అయితే ఈ నేలలో అడుగున రాళ్ళు ఉన్నవి. రాళ్ళు శోధనలు, శ్రమలకు సాదృశ్యముగా యున్నవి. రక్షణ పొందినపుడు శ్రమలు వచ్చును. క్రీస్తు ప్రభువుతో పాటు శ్రమలు కూడా మనకు అనుగ్రహించబడెను (ఫిలిప్పీ 1:30). ప్రభువును నమ్ముకుంటే అంతా కలసి వస్తుంది, ఎప్పుడూ సుఖములు కలుగుతాయి, శ్రమలు రానే రావు, అని ఎవరైన బోధిస్తే అది తప్పు బోధ. క్రీస్తు యేసునందు సద్భక్తి గలిగి యున్నవారు హింసపొందుదురు (2 తిమోతి 3:12).

మారుమనస్సు లేని భర్తను బట్టి, భార్యను బట్టి, పిల్లలను బట్టి, బంధువులను బట్టి, ఇరుగు పొరుగువారిని బట్టి హింస కలుగును. మా తల్లిగారు ప్రభువును నమ్ముకొనుట ద్వారా మా తండ్రి ఐదు సం॥లు ఆమెను హింసించారు. ఎంతో మంది విశ్వాసులు తాము చదువుచున్న కాలేజిలలో పనిచేయుచున్న ఆఫీసులలో శ్రమలు అనుభవించుచున్నారు. భక్తుడైన యోబు యధార్థవంతుడుగా జీవించుట ద్వారా శోధింపబడ్డాడు. దానియేలు ప్రార్ధనా పరుడై ఏ నేరము చేయనందున ఆయన సింహాముల బోనులో వేయబడెను. (దాని 6:16). యవ్వనుడైన యోసేపు పోతీఫరు భార్యను ఎదిరించి జారత్వమునకు దూరముగా పారిపోవుట వలన చెరసాలలో వేయబడెను (ఆది 39:20). శ్రమలలో ప్రభువు తన బిడ్డలకు తోడైయుండును (కీర్త 91:15). శ్రమపొందుట మేలాయెను అని కీర్తనా కారుడు నుడివెను (కీర్త 119:71). ప్రభువు తాను పొందిన శ్రమల ద్వారా విధేయత నేర్చుకొనెను (హెబ్రి 5:8). అందువలన శ్రమలను త్రోసి వేయవద్దు. మొదటి

శతాబ్దములో దేవుని ప్రజలు శ్రమలు కోరుకున్నారు. ప్రభువు కొరకు హతసాక్షులయ్యారు. హతసాక్షుల రక్తము సంఘమునకు విత్తనము. పౌలు మహాశయుడు యేసు నామము కొరకు నేను చనిపోవుటకు సిద్ధముగా ఉన్నానని అన్నారు (అపో.21:13). మోషే దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని 40 సం॥లు వారితో నడిచాడు. సింహాసనము వదులు కున్నాడు (హెబ్రి 11:26).

శ్రమలు అనుభవించుట ద్వారా బహుమానము పొందగలము. అయితే దుర్జనులు, వంచకులు, భక్తిహీనులు అంతకంతకు చెడిపోవుదురు. దుష్టులు గాలి చెదరగొట్టు పొట్టువలె ఉందురు (కీర్త 1:5). అనేక మంది విశ్వాసులు శ్రమలు, కష్టములు రాగానే ప్రభువును విడచిపెట్టి మరలా లోకములోనికి వెళ్ళిపోవుచున్నారు. లోతు భార్య సొదొమ వైపు తిరిగి ఉప్పు స్తంభమైనది. ఓర్పా అత్తను ముద్దు పెట్టుకొని మోయాబులోనికి వెళ్ళి పోయింది. అయితే రూతు కష్టములలో నయోమిని హత్తుకొనుట ద్వారా చివరకు ఆశీర్వాదము పొందినది. ప్రియ స్నేహితుడా నీవు కూడా శ్రమలు, శోధనలలో ప్రభువు కొరకు నిలువబడి ఆశీర్వాదము నొందుము.

## ముండ్లపొదల నేల

ఈ నేలలో ముళ్ళతుప్పలు ఉండుట వలన వాక్యమనే విత్తనము మొలిచింది గాని అణచి వేయ బడినది. ఈ దినములలో అనేకమంది విశ్వాసము అణచి వేయ బడుచున్నది. కారణము ఏమనగా ఐహిక విచిరము అనే ముళ్ళతుప్పలు. మార్త రక్షించబడినప్పటికి విస్తారమైన పనులవలన విచారము కలిగి తొందర పడినది (లూకా 10:39). ప్రభువునే తప్పు పట్టింది. ఇశ్రాయేలీయులు అరణ్యయాత్రలో ప్రతిదాని విషయం వారు విచారించారు. దేవుని మీద, మోషే మీద వారు సణిగి నశించిపోయారు. కొంతమంది భోజనము లేదని, వస్త్రములు లేవని, విచారిస్తారు. విచారించుట కూడా పాపమే. దేనిని గూర్చి చింతపడకుడి అని ప్రభువు చెప్పుచున్నారు (ఫిలిప్పీ 4:5). చింత యావత్తు ఆయన మీద వేయ్యాలి (1పేతురు 5:7). ఎందుకనగా ఆయన మన విషయమై చింతించుచున్నారు. కీషు. గార్ధభములు తప్పిపోయినపుడు వాటిని వెదకుటకు తన కుమారుడైన సౌలును పంపెను. అయితే గార్ధభములు దొరకనందున తన తండ్రి తన కొరకు విచారపడుచున్నాడని సౌలు గుర్తించెను (1సమూ 9:5). అందువలన ఎల్లప్పుడు ప్రభువునందు ఆనందించుడని హెచ్చరించబడుచున్నాము (ఫిలిప్పీ 4:4).

రెండవదిగా ధనమోసము అనే ముళ్ళతుప్పలు. ధనాపేక్ష సమస్త కీడులకు మూలము అని బోధింపబడుచున్నము (1తిమో 6:10). ధనము కొరకు ఈ దినములలో హత్యలు జరుగుచున్నవి. కన్న తల్లిదండ్రులను ఇంటినుండి వెళ్ళ గొట్టు చున్నారు. చిట్స్ వేయించి చివరకు I.P పెట్టు చున్నారు. బోర్డులు త్రిప్పి వేయుచున్నారు. ఉ ద్యోగములు ఇప్పిస్తామని డబ్బుతీసుకొని మోసము చేయుచున్నారు. ధనము పెరిగిన కొలది మనుష్యులలో గర్వము పెరుగుచున్నది. భక్తిహీనుల ధనము వారికి లాభకరము కాదు (సామె 10:2). గెహాజీ ధనము కొరకు నయమాను వెంట పరుగెత్తి కుష్టురోగము తెచ్చుకొనెను. అయితే అబ్రహాము విధేయత కలిగి దేవుడు చూపించు దేశమునకు వచ్చినపుడు ధనవంతుడయ్యెను (ఆది 13:1).

ప్రభువు ఒక వ్యక్తిని ఆశీర్వదించినపుడు అతడు ఐశ్వర్యవంతుడగును (సామె10:22). యోబు యథార్ధవంతుడుగా జీవించుటవలన తూర్పుదేశములో అతనికంటె గొప్పవాడు లేడు. విశ్వాస జీవితములో సత్క్రియలు అను ధనము కలిగియుండవలెను (1తిమో 6:19). తమ ధనములో ఇతరులకు పాలిచ్చువారునై యుండవలెను. ప్రభువు సేవలో నీ ధనము ఉపయోగపడవలెను. మాసిదోనియా సంఘము యొక్క దాతృత్వము విస్తరించెను (2కొరింథీ 8:1). సోదరీ! సోదరుడా! దేవుని సేవకు నీ ధనము ఉ పయోగపడుచున్నదా? మరియు విశ్వాసులు అవిశ్వాసులతో సాంగత్యము చేయుటవలన విశ్వాసము అణచి వేయబడుచున్నది. లోతు నీతిమంతుడైనప్పటికి అతడు సొదొమ వారి మధ్యను కాపురముండట వలన తన మనస్సాక్షి

నొప్పించ బడుచుండెను (2పేతు 2:8). చివరకు తన బిడ్డలు భ్రష్టులైరి. తన భార్య సొదొమ వైపు తిరిగి ఉప్పు స్తంభమైనది. ప్రియుడా నీ కుటుంబము ఎట్లున్నది? అబ్రహాము కుటుంబము వలె వర్ధిల్లుచున్నదా? పరీక్షించుకొనుము.

## మంచి నేల

మంచినేలను పడిన విత్తనము ముప్పది, అరువది, నూరంతలుగా ఫలించెను. ప్రభువు మంచి నేలను గూర్చి చెప్పిన దేమనగా యోగ్యమైన మంచి మనస్సు గలిగి యుండుట అవసరము.

రూతు బోయజు పొలములో ఉన్నప్పుడు రూతును యోగ్యురాలని నుడివెను ( రూతు 3:11). యౌవ్వనురాలైన రూతు మంచి సాక్ష్యమును కలిగియుండెను. తన జన్మభూమిని అనగా మోయాబును విడచి తన అత్తను హత్తుకొనెను. యోగ్యురాలు తన పెనిమిటికి కిరీటము ( సామె 12:4). భార్యలు కుటుంబమునకు సౌందర్యముగా యుండవలెను. యెజెబెలు యోగ్యురాలు కానందున విగ్రహారాధన చేసి బయలు దేవతను ఆరాధించి తన కుటుంబమును పాడుచేసుకొనెను. దేవుని ఉగ్రత ఆమె కుటుంబము మీదికి వచ్చెను. శారా దేవుని ఆశ్రయించి పరిశుద్ధ జీవితము కలిగి యుండుట ద్వారా  తరతరములకు ఆశీర్వాదకరముగా ఉండెను.

మంచి మనస్సు కలిగియుండుట ఐశ్వర్యము. ప్రభువు దృష్టికి మంచిగా ఉండువారికి ఆయన జ్ఞానమును, తెలివిని ఆనందమును అనుగ్రహించును (ప్రసంగి 2:26) తప్పిపోయిన కుమారుడు తండ్రి యొద్దకు తిరిగి వచ్చినప్పుడు నేను యోగ్యుడను కాను అని ఒప్పుకొనెను (లూకా 15:19). తండ్రికి దూరమగుటవలన తాను పొందిన నష్టమును గుర్తించెను. పశ్చాత్తాపము, పాపపు ఒప్పుకోలు, ఒక వ్యక్తిని దేవునికి సమీపస్తునిగా చేయును. ప్రియ స్నేహితుడా యోగ్యమైన మంచి మనస్సును కలిగి యున్నావా? దేవుని వాక్యమును విని అవలంబింప వలసియున్నాము. వినుట మాత్రము చాలదు. శ్రద్ధగా విని ఆయన ఆజ్ఞలను అనుసరించవలెను (ద్వితి 28:1). అప్పుడు నీవు హెచ్చింపబడెదవు. దావీదు గొర్రెలు కాచుకొనునప్పటినుండి దేవుని కట్టడలు అనుసరించెను. అందువలన ప్రభువు అతనిని కోరుకొనెను. అంతమాత్రమే గాక ప్రభువు అతనిని రాజుగా చేసెను (కీర్త 78:70-71).

సోదరి! సోదరుడా! నిన్ను ఆయన కోరుకొనగలడా? నీ అంతరంగము శుద్ధీకరించబడినదా? నేను యథార్థవంతుడనై యున్నాను అని ఆయన చెప్పెను (కీర్త 26:1).  మంచి నేలను పడిన విత్తనము ఏదనగా ఓపికతో ఫలించువారు. భక్తిజీవితము ( Instant Coffee) వంటిది కాదు. ఓపిక, సహనము ఉండవలెను. యోబులో ఎంతో సహనము కలదు. శ్రమలలో ప్రభువును దూషింపలేదు. ఆఖరికి భార్య కూడా దేవుని దూషించమని ప్రేరేపించినప్పటికి ఆయన ఆలాగు చేయలేదు. యోబు యొక్క సహనము ఎంతో గొప్పది గదా (యోబు 5:11).

మంచి నేలను పడిన విత్తనము నూరంతలు అనగా పరిపూర్ణముగా ఫలించుట. విశ్వాసి ఫలించుటవలన దేవుడు మహిమ పరచబడును (యోహా 15:8).

## ఫలించుట ద్వారా కలుగు ఫలములు

1. మారుమనస్సు అనుభవము కలుగును. మార్కు 1:15.
2. వాక్యము హృదయములో సమృద్ధిగా యుండును. కొలస్సీ 3:16
3. దేవుని ప్రేమతో నింపబడుదురు. రోమా 5:5.
4. సువార్త ప్రకటించుటకు సిగ్గుపడరు. రోమా 1:16
5. ప్రభువు సేవకిచ్చుట నేర్చుకొందురు. మలాకీ 3:10
6. అగ్నిలో నుండి లాగి కొందరిని రక్షించుదురు. యూదా 1:23

ప్రభువు ఇట్టి కృప మీకు అనుగ్రహించును గాక!